



గతేడాది అక్టోబరులో కల్లూరు సమీపంలో రోడ్డు దాటుతున్న ఏనుగుల మంద



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంటను చూపిస్తున్న లవకుమార్

కుంకీలను
పులిచెర్లకు పంపరా?

- మూడేళ్లుగా పంటలపై కొనసాగుతున్న గజదాడులు
- వ్యవసాయంపై ఆశలు వదులుకుంటున్న అన్నదాతలు
- నిద్రలేని రాత్రులు గడుపుతున్న అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు

కల్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో మూడేళ్లుగా పంటలపై గజరాజులు వరుస దాడులు చేస్తున్నాయి.ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికి వచ్చే వేళ ఏనుగుల గుంపు నాశనం చేస్తుండడంతో అన్నదాతలు వ్యవసాయంపైనే ఆశలు వదులుకుంటున్నారు.ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు తూతూమంత్రంగా నష్టపరిహారం చెల్లించి సరిపెట్టుకుంటున్న అటవీశాఖపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ స్వల్ప నష్ట పరిహారం కోసం కూడా అనేక మంది రైతులు ఇంకా ఎదురుచూస్తున్నారు.అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలైతే



ఏనుగుల దాడిలో నేలకూలిన కొబ్బరిచెట్టు (ఫైల్ ఫొటో)

గజదాడుల భయంతో నిద్రలేని రాత్రులు గడపుతున్నారు. పులిచెర్ల మండలంలోని తూర్పు, పశ్చిమ విభాగం అటవీ ప్రాంతం సరిహద్దులో ఉన్న కల్లూరు, పాతపేట, చల్లావారిపల్లి, బోడిరెడ్డిగారిపల్లి, దేవళంపేట, వెంకటదాసరపల్లి, పాళెం, కమ్మపల్లి, గడ్డంవారిపల్లి, రెడ్డివారిపల్లి, ఎల్లంకివారిపల్లి, పోశంవారిపల్లి, కావేటిగారిపల్లి పంచాయతీల్లో గజదాడులతో పంటలకు అపార నష్టం వాటిల్లుతోంది. ఇక్కడి రైతులు ప్రధానంగా మామిడి, టమోటా, వరి పంటలు పండిస్తుంటారు.ఇటీవల ఏనుగుల గుంపు దాడుల్లో వీటితో పాటు కొబ్బరి, అరటి, వంకాయ, వేరుశనగ పంటలను కూడా ధ్వంసం చేస్తున్నాయి. మామిడితోటలకు అమర్చిన రాతికూసాలు, డ్రిప్ పైపులను కూడా విరిచేస్తుండడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది.ఈ మూడేళ్ల కాలంలో 200 హెక్టార్ల వరి, 100 హెక్టార్ల టమోటా , 200 హెక్టార్ల మామిడి ,10 హెక్టార్ల కూరగాయల పంటలు, 500 కొబ్బరిచెట్లు,వందల సంఖ్యలో రాతికూసాలు ధ్వంసమయ్యాయి. ఇక మామిడి సీజన్‌లో మూడేళ్ల కాలంలో ఏనుగుల దాడుల్లో వందల టన్నుల మామిడికాయలు నేలరాలిపోవడంతో రైతులు,లీజుకు తీసుకున్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల కట్టడికి కూటమి సర్కారు కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను రప్పించడంతో బాధిత రైతుల్లో ఆశలు చిగురించాయి.గతనెల 7వ తేదీన బంగారుపాళ్యం మండలం కీరమంద, కొదలమడుగు అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఆరు కుంకీలతో చేపట్టిన ఆపరేషన్ గజ సక్సెస్ కావడంతో ఇక పులిచెర్ల మండలంలో పంటలను ధ్వంసం చేస్తున్న గజరాజుల కట్టడికి కుంకీలను తరలిస్తామని అప్పటి డీఎఫ్‌వో భరణి ప్రకటించారు. దీంతో మండలంలోని గజ బాధిత రైతులు కుంకీల రాకపై ఆశలు పెంచుకున్నారు. అయితే అటవీశాఖ ఆ దిశగా ప్రయత్నిస్తున్నట్లు కన్పించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కుంకీలను రంగంలోకి దింపడంలో ఆలస్యం ఎందుకు చేస్తున్నారని,ఇంకెంత కాలం తాము పంటలను కోల్పోవాలని ప్రశ్నిస్తున్నారు.



ఏనుగుల దాడిలో దెబ్బతిన్న టమోటా పంటను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు (ఫైల్ ఫొటో)

ఆగని పంటల ధ్వంసం

పులిచెర్ల మండలం బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీ ఆవులపెద్దిరెడ్డిగారిపల్లి వద్ద బుధవారం రాత్రి పంటలపై ఏనుగుల గుంపు దాడి చేయడంతో పంటలకు అపార నష్టం వాటిల్లింది. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని పెద్దవంక నుంచి బయలుదేరిన 14 ఏనుగుల గుంపు పాతపేట మీదుగా ఆవులపెద్దిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకున్నాయి. లవకుమార్, వీరయ్య, గోపి, అంజి, రామయ్య, రవికుమార్‌కు చెందిన వరిపంటలను ధ్వంసం చేశాయి.వెంకటయ్యకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి.రాత్రి 12 గంటల సమయంలో ఏనుగుల దాడులను గమనించిన గ్రామస్థులు పొలాల వద్దకు చేరుకొని టపాకాయలు పేలుస్తూ అరుపులు పెట్టారు. అయితే ఏమాత్రం లెక్కచేయని ఏనుగుల గుంపు మరింత రెచ్చిపోతూ పొలాల్లోని గట్లను కూడా ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి చొక్కావారిపల్లి వెళ్లే మార్గంలోని కలబందను తినేశాయి. అక్కడి నుంచి అడవిలోకి తిరుగుముఖం పట్టిన ఏనుగులు గోగులమ్మ వంక వద్దకు చేరుకున్నాయి. గురువారం పగలంతా గోగులమ్మ వంక సమీపంలోని పెద్దవంక వద్ద తిష్ట వేసినట్లు స్థానిక ప్రజలు తెలిపారు.

21 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావ కారణంగా గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 21 మండలాల్లో ఓ మోస్తరు నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా.. రామకుప్పంలో 48.2, అత్యల్పంగా.. కుప్పంలో 1.6 మిమీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా.. శాంతిపురంలో 36.4, వికోటలో 33.4, చౌడేపల్లెలో 26, పెనుమూరులో 25.2, పుంగనూరులో 24.6, కార్వేటినగరంలో 22.4, సదుంలో 20.8, పలమనేరులో 19.2, బైరెడ్డిపల్లెలో 18.2, శ్రీరంగరాజపురంలో 20.2, ఐరాలలో 15.4, గుడుపల్లెలో 12.4, పూతలపట్టులో 10.4, రొంపిచెర్లలో 9.8, బంగారుపాళ్యంలో 7, సోమలలో 6.4, గంగాధరనెల్లూరులో 3, పెద్దపంజాణిలో 2.4, పులిచెర్లలో 2 మి.మీ వర్షపాతం నమోదైంది.

పెనుమూరు 'విండో'కు త్రిసభ్య కమిటీ నియామకం

చిత్తూరు కలెక్టరేట్/పెనుమూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పెనుమూరు సింగిల్ విండోకు నాన్ అఫిషియల్ త్రిసభ్య కమిటీని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ కమిటీ పదవీ బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి ఈ ఏడాది అక్టోబరు 30వ తేదీ వరకు కొనసాగుతుందని ఆ ఉత్తర్వులో పేర్కొంది. చైర్మన్‌గా పి.శ్రీనివాసులు (పెనుమూరు జనసేన మండలాధ్యక్షుడు), డైరెక్టర్లుగా ఎ.అబ్దుల్ సలాం, జి.సుబ్రహ్మణ్యం నాయుడులను నియమించింది.

15 నుంచి ఇంటర్ త్రైమాసిక పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈనెల 15వ తేదీ నుంచి త్రైమాసిక పరీక్షలు నిర్వహించనున్నట్లు పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ మజీద్ తెలిపారు. గురువారం ఆయన కళాశాలలో మాట్లాడుతూ.. వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

కల్పవృక్ష వాహనంలో పార్వతీ తనయుడు





ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో గురువారం రాత్రి వినాయక స్వామి కల్పవృక్ష వాహనంలో దర్శనమిచ్చారు.ఆలయ ఈవో, అర్చక, వేదపండితులు, సిబ్బంది ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం మూల విరాట్‌కు పంచామృత అభిషేకం నిర్వహించారు. రాత్రి ఉభయ వరస రావడంతో ఆలయ అలంకార మండపంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను కల్పవృక్ష వాహనంపై ఉంచి కాణిపాక పుర వీధుల్లో ఊరేగించారు.ప్రత్యేక ఉత్సవాల్లో శుక్రవారం స్వామికి విమానోత్సవం నిర్వహించనున్నారు.

108వ వడిలోకి టీసీ రాజన్



పలమనేరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు,పలమనేరు మాజీ ఎమ్మెల్యే, టీసీ రాజన్ 108వ జన్మదిన వేడుకలు జరుపుకొన్నారు. నిస్వార్థ రాజకీయ నాయకుడిగా, నిరాడంబరుడిగా, నియోజకవర్గ అభివృద్ధిపైన, జిల్లా సమస్యలపైన అసెంబ్లీలో గళం విప్పిన శాసనసభ్యుడిగా టీసీరాజన్‌కు పేరుంది. ఆయన 108వ జన్మదిన సందర్భంగా పట్టణ ప్రముఖులు,శ్రేయోభిలాషులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలను నేరుగా, సోషియల్ మీడియా వేదికగా తెలియజేశారు.

పది రోజుల్లో మామిడి రైతులకు రూ.160 కోట్ల సబ్సిడీ జమ
- కలెక్టర్ సుమిత్‌కుమార్

7వ పేజీ

నెలలోపు అగ్నిమాపక పరికరాల వివరాలు తెలపాలి
భవన యజమానులకు అగ్నిమాపక శాఖ సూచన

6వ పేజీ





విశాఖ విమానాశ్రయంలో చిత్తూరువాసులకు స్వాగతం పలుకుతున్న ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిరప్రసాద్ తదితరులు - తిరుపతి విమానాశ్రయం వద్ద స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, మురళీమోహన్ తదితరులు

నేపాల్ నుంచి సురక్షితంగా....

సాదరస్వాగతం పలికిన ప్రజా ప్రతినిధులు ● ప్రత్యేక వాహనాల్లో స్వస్థలాలకు పయనం

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):నేపాల్ దేశంలో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న వారంతా సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారు.వారికి ప్రజాప్రతినిధులు, అధికారులు సాదరస్వాగతం పలికి దగ్గరుండి మరీ ప్రత్యేక వాహనాల్లో స్వస్థలాలకు పంపించారు. నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు వారిని రాష్ట్రానికి సురక్షితంగా తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా ఖాట్మండు విమానాశ్రయం నుంచి బయల్దేరి గురువారం రాత్రి 10.55 గంటలకు తిరుపతి ఎయిర్‌పోర్టుకు చేరుకున్న 40మంది తెలుగు వారికి తిరుపతి, చంద్రగిరి, పూతలపట్టు, కడప, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, మురళీ మోహన్, మాధవిరెడ్డి, శ్రీధర్‌తోపాటు కలెక్టర్ వెంకటేశ్వర్ స్వాగతం పలికారు.తిరుమల శ్రీవారి ప్రసాదాలను, శ్రీకాళహస్తీశ్వరుడి ప్రసాదాలను అందించారు. రాజంపేట, కోడూరు, కడప, నంద్యాలకు చెందిన వారిని స్వస్థలాల వద్ద విడిచి పెట్టేందుకు ప్రత్యేకంగా ఒక బస్సును ఏర్పాటు చేశారు. మిగిలిన వారి కోసం 12 కార్లను సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వ సహకారం, ప్రత్యేకంగా మంత్రి నారా లోకేశ్ చొరవ లేకుంటే తాము తిరిగి స్వదేశానికి చేరుకునే వాళ్లం కాదని ఎంతో శ్రమించి తమకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్వదేశానికి తీసుకురావడంలో కృషి చేసిన కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని నేపాల్ నుంచి వచ్చిన వారు భావోద్వేగానికి గురయ్యారు.శాప్ చైర్మన్ రవినాయుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్,తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఆర్డీవో మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.



పరిపాలనా భవనంలో స్వామి చిత్రపటానికి హారతి ఇస్తున్న ఈవో సింఘాల్

టీటీడీ పరిపాలనా భవనంలో ఈవో

తిరుమల, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): ఈవోగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్ సింఘాల్ గురువారం తిరుతిలోని టీటీడీ పరిపాలనా భవనంలోని పలు శాఖలను సందర్శించారు. అకౌంట్స్, అన్నదానం, బోర్డు సెల్, ఐటీ, సోషల్‌మీడియా, ఇంజినీరింగ్, ఎడ్యుకేషన్, ప్రజా సంబంధాలు, ఎస్టేట్ కార్యాలయాలను సందర్శించి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఉద్యోగులు ఈవోకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు పద్మావతి, గోవిందరాజస్వామి, కపిలేశ్వర స్వామి, కోదండ రామస్వామి ఆలయాల నుంచి వచ్చిన వేదపండితులు ఈవోకు ఆయన ఛాంబర్‌లో ఆశీర్వచనం చేశారు. ఈవో పలు ఫైళ్లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఈవో సిబ్బందితో మాట్లాడుతూ, అధికారులు, ఉద్యోగులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని సేవలను వేగవంతం చేయాలని సూచించారు.

తన ఛాంబర్‌లో ఫైలుపై సంతకం చేస్తున్న ఈవో →



శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు, ప్రభుత్వ చీఫ్‌విప్ బొలిశెట్టి శ్రీనివాస్, విప్ గణబాబు, ఎమ్మెల్యేలు రమేష్, చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రి కిల్లి కృపారాణి, తిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ ఉన్నారు. సినీనటి, యాంకర్ శ్రీముఖి వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.56 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,086

తలనీలాలు సమర్పించినవారు: 28,239





ఎటు చూసినా భక్త జనమే

జాతర ప్రశాంతం

వెంకటగిరి/వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వచ్చే వాళ్లు వస్తుంటే.. పోయే వాళ్లు పోతుంటే.. ఎటు చూసినా భక్తజనమే. వెంకటగిరి పోలేరమ్మ జాతరకు గురువారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వీఐపీలు ఎక్కువ కావడంతో సామాన్య భక్తులు ఇబ్బంది పడ్డారు. క్యూలైన్ వద్ద కొందరు భక్తులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కొందరు పోలీసు సిబ్బంది తమవారికి దర్శనం చేయించడానికి ప్రాధాన్యం ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. రూ.100, రూ.300, రూ.500 క్యూ ప్రవేశాలు పెట్టినా, వీవీఐపీ దర్శనంలో ఫ్రీగా వదిలి వేశారు. జాతరను నిర్వహించడంలో అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నీ తానై వ్యవహరించారు.



భక్తుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

ఎలాంటి గొడవలు లేకుండా జాతర ప్రశాంతంగా జరిగింది. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు దగ్గరుండి బందోబస్తును పర్యవేక్షించారు. క్యూలైన్‌లో భక్తులకు నీటి సరఫరా చేయాల్సిన ఎండోమెంట్, మున్సిపాలిటీ చేతులు ఎత్తివేశారు. దీంతో క్యూలైన్‌లో భక్తుల ఇబ్బందులు గుర్తించిన ఎస్పీ.. నీటిని అందివాల్సిందిగా పోలీసులను ఆదేశించారు. దీంతో గూడూరు డీఎస్పీ గీతాకుమారి సిబ్బందితో కలిసి క్యూలైన్‌లో భక్తులకు నీళ్ల బాటిళ్లను అందించారు. మద్యం మత్తులో కొందరు ఆకతాయిలు పోలీసులు పట్ల దురుసుగా వ్యవహరించినా సుత్తిమెత్తగా మందలించి పంపించేశారు.

అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ


పోలేరమ్మ జాతర రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందడంలో ప్రభుత్వం తరఫున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, దేవదాయశాఖ శాఖ కమిషనరు రామచంద్ర నాయుడు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోలేరమ్మకు భక్తులు పొంగళ్లు పెట్టేందుకు మండపం నిర్మిస్తామని తెలిపారు. పోలేరమ్మ జాతరకు రాష్ట్ర గుర్తింపుతో పాటు.. జాతర నిర్వహణకు రూ.40లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తన డబ్బుతో క్రాస్‌రోడ్డు వద్ద అమ్మవారి ఆర్చి నిర్మించారన్నారు. ఆయన కోరిక మేరకు పాలకేంద్రం వద్ద మరో ఆర్చిని ప్రభుత్వ నిధులతో నిర్మించనున్నట్లు చెప్పారు. అమ్మవారి దేవస్థానానికి ఆర్థిక వనరులు సమకూర్చేలా దక్షిణపు వీధిలో 75 అంకణాల స్థలాన్ని దేవస్థానికి చెందేలా రాయించి, అందులో రూ.1.65 కోట్లతో జ్ఞాన మందిరం, కమర్షియల్ కాంప్లెక్సు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించనుట్లు తెలిపారు. అనంతరం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్, పోలేరమ్మ దేవస్థానం ట్రస్టు చైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

రోజా వ్యాజ్యంపై వివరాలు సమర్పించండి

నగరి పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నగరి టీడీపీ ఎమ్మెల్యే గాలిభానుప్రకాశ్‌పై కేసు నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆర్‌కె రోజా వేసిన వ్యాజ్యంలో వివరాలు సమర్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణ ఈ నెల 16కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. నగరి టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేసినప్పటికీ నగరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేయడంలేదని పేర్కొంటూ రోజా హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ ఏడాది జూలై 17న తాను ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఐఐటీలో ఐదుగురు ప్రొఫెసర్లకు అవార్డుల ప్రదానం



అవార్డులు అందుకున్న ప్రొఫెసర్లతో డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ

ఏర్పేడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఐదుగురు ప్రొఫెసర్లకు టీచర్స్‌డే సందర్భంగా ఉత్తమ సేవా అవార్డులను ప్రదానం చేశారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, ఐఐటీ మద్రాస్‌కు చెందిన ఎలక్ట్రికల్ ఇంజనీర్ విభాగం హెడ్ భాస్కర్ రామమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి అవార్డులు ప్రదానం చేశారు. బెస్ట్ రీసెర్చ్ అవార్డును ప్రొఫెసర్ రవిశంకర్, ప్రొఫెసర్ ఎం.షికావుద్దీన్, బెస్ట్ టీచర్స్ అవార్డును రాఘవేంద్ర, ఎం.పంచాత్రం అందుకున్నారు. యంగ్ రీసెర్చ్ అవార్డును అభిషేక్ కుమార్ అమదుకున్నారు.

గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా పద్మావతి వర్సిటీ విద్యార్థిని



చంద్రికను అభినందిస్తున్న వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ బీటెక్ సీఎస్ఈ నాల్గవ సంవత్సర విద్యార్థిని కుంచెల చంద్రిక గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. గూగుల్ టెక్నాలజీపై స్వల్పకాలిక అవగాహన, శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం చంద్రికకు కలిగింది. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ మల్లికార్జున, హెడ్ సరిత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు 24మంది

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో వచ్చేనెల నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు 24మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. శ్రీనివాస క్రీడా సముదాయంలో గురువారం జరిగిన అండర్ 11, 14, 17, 19 విభాగాలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 112మంది ప్రాతినిధ్యం వహించారు. ప్రతి విభాగం నుంచి ముగ్గురు చొప్పున బాలబాలికలు విజయం సాధించారు. జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు కిషోర్‌కుమార్, భార్గవి, స్కేటింగ్ కోచ్ ప్రేమ్‌నాథ్ అభినందించారు. అంతకుముందు శాప్ చైర్మన్ రవినాయుడు క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రతిభచాటాలని ఆకాంక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయులు గాంధీ, శోభన్‌బాబు, శ్రీధర్, వినోద్ పాల్గొన్నారు.



స్కేటింగ్ క్రీడాకారులతో శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్‌గా మహేష్



తిరుపతి, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ చైర్మన్‌గా టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్ నిమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వచ్చాయి. సభ్యులుగా టీడీపీ నుంచి ఎం.గుణ, జి.భాగ్యవల్లి, బి.సుబ్రమణ్యం, శ్యామల, లక్ష్మణరావు, జనసేన నుంచి రుద్రకిషోర్, మధులత, వరలక్ష్మి, విమల, బీజేపీ నుంచి టి.చంద్రశేఖర్, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకుడు మురళి నియమితులయ్యారు.

తిరుమలలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్



కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ శ్రీవారి దర్శనార్థం గురువారం తిరుమలకు వచ్చారు.తిరుమలలోని గాయత్రి గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న ఆమెకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళికృష్ణ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.. నిర్మల సీతారామన్ రాత్రికి తిరుమలలోనే బస చేసి శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు.

నెలలోపు అగ్నిమాపక పరికరాల వివరాలు తెలపాలి

భవన యజమానులకు అగ్నిమాపక శాఖ సూచన

విజయవాడ (వన్‌టౌన్), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని భవన యజమానులు నెల రోజుల్లోపు వారి భవనాలలో అగ్నిమాపక పరికరాల వివరాలను తెలియజేయాలని రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ సంచాలకుడు రమణ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి మధ్యవర్తులను ఎవరినీ సంప్రదించవద్దని, ఏదైనా సమాచారం కావాలంటే 9441236448 నెంబరులో కానీ, కనెక్ట్ డీజీ ఫైర్ జీ మెయిల్‌లో కానీ సంప్రదించాలని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు తీర్పు మేరకు 2021-22 సంవత్సరంలో అగ్నిమాపక శాఖ జారీ చేసిన నిరభ్యంతర ధ్రువపత్రాలను సవరిస్తూ జారీ చేసిన ప్రభుత్వ గెజిట్ మేరకు అగ్నిమాపక చట్టం 1999కి అనుగుణంగా హైరైజెడ్ భవనాలలో అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేయటానికి సమయం ఇచ్చినట్టు వెల్లడించారు. భవన యజమానులు 30 రోజుల్లో ఈ వివరాలను అందించాలని, అదనపు సమయం అవసరమైతే అగ్నిమాపక శాఖకు రాతపూర్వకంగా విజ్ఞప్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. చట్టానికి అనుగుణంగా భవనాల్లో అగ్నిమాపక పరికరాలు ఉన్నట్లయితే రివైజ్డ్ నిరభ్యంతర (ఎన్‌వోసీ) జారీ చేస్తామని తెలిపారు.

వైద్య డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల గడువు పొడిగింపు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలలో రెండేళ్ల కాలవ్యవధి పారామెడికల్ డిప్లొమా(అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్) కోర్సులకు సంబంధించిన దరఖాస్తుల గడువును ఈనెల 27వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నాలజీ 30 సీట్లు, డిప్లమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ 30 సీట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తు కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీపీఎంటీ.సీవో.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు. పూర్తి వివరాలకు 9440879943ను సంప్రదించాలని పేర్కొన్నారు.

సెట్విన్ సీఈవోగా యశ్వంత్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సెట్విన్ సీఈవోగా డాక్టర్ పి.యశ్వంత్ నియమితులయ్యారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ క్యాడర్‌తో ఈయన డిప్యూటేషన్‌తో ఇప్పటి వరకు విజయవాడలోని పశుపోషణ విభాగం సంచాలకులుగా ఉన్నారు. ఏడాది కాలపరిమితితో డిప్యూటేషన్‌పై తిరుపతి జిల్లా సెట్విన్ సీఈవోగా బదిలీ అయ్యారు.

జిల్లా కోర్టు ప్రహరీ తొలగింపు



పనులను పర్యవేక్షిస్తున్న ఏసీపీ నాగేంద్ర

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో జరుగుతున్న హైరోడ్డు విస్తరణలో భాగంగా పట్టణ ప్రణాళిక అధికారులు కోర్టు ప్రహరీ తొలగింపు కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఇప్పటికే కట్టమంచి వెంకుశ కళ్యాణ మండపం నుంచి కలెక్టరేట్ వరకు ఉన్న ప్రభుత్వ స్థలాలు, రోడ్డు పక్కన ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఈ క్రమంలోనే 900 అడుగుల కోర్టు ప్రహరీని ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు.

ప్రతి ఒక్కరికీ 'అభ' ఐడీలుండాలి

● డీఎంహెచ్‌వో సుధారాణి



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరురూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి ఒక్కరికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అభ) ఐడీలు ఉండాలని స్టాఫ్‌నర్సులు, పారామెడికల్ సిబ్బందిని డీఎంహెచ్‌వో సుధారాణి ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. అభ కార్డుతో ఆరోగ్య సంరక్షణ సేవలను ఆన్‌లైన్‌లో పొందుపర్చవచ్చన్నారు. ప్రస్తుతం కుప్పంలో డిజిటల్ నర్వ్ సెంటర్ నడుస్తోందని, అదేవిధంగా చిత్తూరులో కూడా ప్రారంభించడం జరుగుతుందని వివరించారు. అలాగే జిల్లా నిర్వహించనున్న ఎన్‌సీడీ 4.0 చాలా కచ్చితత్వంతో ఉండాలన్నారు. క్యాన్సర్ లక్షణాలున్న ప్రతి ఒక్కరినీ గుర్తించి వైద్యం కోసం రెఫర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో కళా ఉత్సవ్ ప్రారంభం



నృత్యం చేస్తున్న విద్యార్థిని

వెదురుకుప్పం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో ఉన్న జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో జిల్లా స్థాయిలో కళా ఉత్సవ్ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దామోదర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ పోటీలలో 250మంది ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా నోడల్ అధికారి రంజిత్ కుమార్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన గురువారం చిత్తూరు నగరంలో జరిగింది. జీడీ నెల్లూరు మండలం ఆరుమాకుల పల్లెకు చెందిన అరుణ్‌కుమార్‌కు గుడిపాల మండలం 190 రామాపురానికి చెందిన అశ్విక(35)తో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. పిల్లల చదువుల కోసం మిట్టూరులో నివాసముంటున్నారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో అశ్విక పిలిస్తే పలకడం లేదని, చలనం లేదని పక్క గదిలో ఉన్న మామకు అరుణ్‌కుమార్ చెప్పాడు. అక్కడికి వెళ్లి చూసేసరికి చనిపోయిందని నిర్ధారించుకుని ఆరుమాకులపల్లెకు మృతదేహాన్ని తీసుకెళ్లి దహనక్రియలు నిర్వహించారు. తన కుమార్తె మృతిపై అనుమానముందని మృతురాలి తల్లిదండ్రులు చెప్పడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటవ పట్టణ సీఐ మహేశ్వర వివరించారు.

రోజా కుమార్తెకు అవార్డు



అన్షుమాలిక

నింద్ర, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):అమెరికాలోని ఇండియానా యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ కంప్యూటర్స్ కోర్సు చదువుతున్న మాజీ మంత్రి రోజా కుమార్తె అన్షుమాలికకు మౌరీన్ బిగ్గర్స్ అవార్డు లభించింది.టెక్నాలజీలో ఈక్విటీని ప్రోత్సహించడంలో యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మౌరీన్ బిగ్గర్స్ అందించిన సేవలను గౌరవించేందుకు 2023నుంచి యూనివర్సిటీ ఈ అవార్డును ప్రదానం చేస్తోంది. సాంకేతికతలో సమానత్వం దిశగా కృషి చేసే విద్యార్థులకు ఈ అవార్డును అందజేస్తారు.

జగన్‌వి నీచ రాజకీయాలు : గౌనివారి

రామకుప్పం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సిగ్గులేని నీచరాజకీయాలకు వైసీపీ అధినేత జగన్ కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజారంజక పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వంపై అభాండాలు వేస్తున్నారన్నారు. జగన్ పదేపదే అబద్ధాలు చెబుతూ వాటినే నిజాలుగా నమ్మించి, ప్రజలను, రైతులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సీఎంగా నవరత్నాల పేరిట సామాన్య జనాన్ని, రైతులను నట్టేట ముంచిన జగన్, అధికారం కోల్పోవడంతో ప్రభుత్వంపై తన మీడియా వ్యవస్థలతో విషం వెదల్లుతున్నారన్నారు. మొన్నటి వరకు మిర్చి, పొగాకు, మామిడి, ఉల్లి ధరలపై నాటకాలాడిన జగన్ కొత్తగా ఎరువుల కొరతపై అబద్ధాలు వల్లిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. అనవసర నిరసన కార్యక్రమాలతో రాష్ట్రంలో అల్లకల్లోల పరిస్థితులు నెలకొల్పే ప్రయత్నం తప్ప ఆయనకు రైతులపై ఎటువంటి ప్రేమ లేదని తెలిపారు. ఎన్ని దుష్ప్రచారాలు చేసినా రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా, ప్రజలు సంతోషంగా ఉండాలన్నా చంద్రబాబు నాయకత్వమే అవసరమన్న అభిప్రాయం రాష్ట్ర ప్రజల్లో నిలిచిపోయిందని తెలిపారు.

మాంసాభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా మీరా



నింద్ర, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మాంసాభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నగరి మున్సిపాలిటీ మాంగాడు గ్రామానికి చెందిన మీరాను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.గతంలో నగరి ఎంపీపీగా పని చేసిన మీరా తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధిగా టీడీపీకి సేవలందించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అరెస్టయి ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ వెనుదీయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేశారు.టీడీపీ అభివృద్ధికి తాను చేసిన కృషిని గుర్తించి ఈ పదవికి ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్,నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్‌లో ఎస్వీయూ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీలో ఈనెల 10వ తేదీ నిర్వహించిన అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్స్‌లో ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సాంకేతిక-సామాజిక సమస్యలకు పరిష్కారాన్ని అన్వేషించడం అనే థీమ్‌కు సంబంధించి పది వినూత్న ఆలోచనలను ఈ వేదికపై ఎస్వీయూ విద్యార్థులు ప్రదర్శించారు. తిరుపతి, కడప, నెల్లూరు జిల్లాలకు చెందిన అనేక బృందాలు పోటీపడగా ఎస్వీయూ డేటా సైన్స్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు.

మహిళల భద్రతకు భరోసా!

పని ప్రదేశాల్లో వేధింపుల నివారణకు చర్యలు ● ప్రభుత్వ కార్యాలయాల్లో భద్రతా కమిటీల ఏర్పాటు



కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన షీబాక్స్ ఫిర్యాదు పెట్టె

చిత్తూరుకలెక్టరేట్,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): మహిళలూ....పనిప్రదేశాల్లో ఎవరైనా వేధిస్తున్నారా...? వికృత చేష్టలతో ఇబ్బంది పెడుతున్నారా? బెదిరింపులతో మానసిక క్షోభకు గురిచేస్తున్నారా? మీ బాధ ఎవరితో పంచుకోవాలో తెలియట్లేదా? ఇక మీకు ఆ బెంగ అవసరం లేదు. భద్రతా కమిటీలు మీకు భరోసానిస్తాయి. ఫిర్యాదు చేసిన వెంటనే అండగా నిలుస్తాయి.



పని ప్రదేశాల్లో ఉద్యోగినుల భద్రతకు అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఐసీ(సీ)లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మహిళలను లైంగికంగా వేధించినా, ఇబ్బంది పెట్టినా బాధ్యులకు చట్టప్రకారం శిక్షపడేలా ఈ కమిటీలు చూస్తాయి. ఇప్పటివరకు చూసీచూడనట్లు వ్యవహరించిన జిల్లాయంత్రాంగం ఐసీసీలను విధిగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఉద్యోగినులు, మహిళా కార్మికులు స్వేచ్ఛగా విధులు నిర్వహించేలా చూడడమే వీటి లక్ష్యం. ప్రస్తుతం

● జిల్లాలోని 92 శాఖల ప్రభుత్వకార్యాలయాల్లో మూడువేల మందికి పైగా మహిళలు పనిచేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో వేలసంఖ్యలో ఉపాధ్యాయినులు, అధ్యాపకురాళ్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇతర సిబ్బంది సైతం భారీసంఖ్యలోనే ఉన్నారు.

● ప్రైవేటు సంస్థల్లో కూడా వేలసంఖ్యలో మహిళలు పనిచేస్తున్నారు.

● కొన్నిచోట్ల ఉద్యోగినులను సహచర ఉద్యోగులే లైంగికంగా, మానసికంగా వేధిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. బాధితులు ఫిర్యాదు చేస్తున్నా, ఆయా కార్యాలయ అధిపతులు పట్టించుకోవడం లేదు. దాంతో చాలా మంది మహిళా ఉద్యోగినులు బాధను భరిస్తూ మౌనంగానే ఉండిపోతున్నారు.

వీటిని ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా కలెక్టర్ కార్యాలయంలో సైతం ఉద్యోగినుల నుంచి ఫిర్యాదు స్వీకరించేందుకు పెట్టెను ఏర్పాటు చేశారు. ప్రైవేటు రంగంలోనూ వీటిని ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. 2013లో కేంద్రప్రభుత్వం చేసిన చట్టం ప్రకారం ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు, కార్యాలయాల్లో 10మందికి పైగా ఉద్యోగులుంటే ఐసీసీ ఏర్పాటు తప్పనిసరి. ఆయా సంస్థలు, కార్యాలయాల్లో ఒక్క మహిళా ఉద్యోగి ఉన్నా కమిటీ ఏర్పాటు చేయాల్సిందే.

ఇవన్నీ ఇబ్బంది పెట్టడమే...!

● మహిళల ఇష్టానికి విరుద్ధమైన ప్రవర్తనలన్నీ వేధింపుల కిందికే వస్తాయి. అనవసరంగా తాకాలనుకోవడం, శారీరక సంబంధం కావాలంటూ వెకిలి చేష్టలు చేయడం, అసభ్యకరమైన మాటలు/ చేష్టలు, ఇబ్బందికరంగా ప్రవర్తించడం, ఆత్మగౌరవం దెబ్బతీసేలా వ్యవహరించడం ... అన్నీ కూడా ఇబ్బంది పెట్టడమే అవుతుంది.

ఉపేక్ష లేదు...ఇక శిక్షే...!

● జిల్లా, మండల, గ్రామస్థాయిల్లోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రైవేటు కార్యాలయాలు, కర్మాగారాలు, సంస్థల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

● కమిటీల్లో ఆయా శాఖల అధికారులు నియమించిన సభ్యులు ఉంటారు. పనిప్రదేశంలో వేధింపులకు గురైన మహిళా కార్మికులు, ఉద్యోగినులు లిఖితపూర్వకంగా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన పెట్టెలో ఫిర్యాదు చేయవచ్చు. మూడునెలల్లోగా చర్యలు తీసుకుంటారు. కేసు తీవ్రతను బట్టి బాధ్యుడ్ని బదిలీచేయడం, విధుల నుంచి తొలగించడం, ఉద్యోగోన్నతి నిలుపుదల, అపరాధ రుసుం విధించడం వంటివి చేస్తారు.

● బాధితులతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని కమిటీ విచారిస్తుంది. సాక్ష్యాలు సేకరిస్తుంది.

● వేధింపులు నిజమని తేలితే బాధ్యులపై క్రమశిక్షణా చర్యలకు కమిటీ సిఫార్సు చేస్తుంది. పోలీసుల దృష్టికి తీసుకెళ్ళి చట్టపరంగా శిక్షించేందుకు సహకరిస్తుంది.

ఫిర్యాదుకు 'షీబాక్స్'

పనిప్రదేశాల్లో వేధింపులపై మహిళలు ఫిర్యాదు చేసేందుకు కేంద్రప్రభుత్వం 'షీ బాక్స్' www.she-box.wcd.gov.in వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. సంస్థలు దీనిలో కమిటీల వివరాలను కూడా చేయవచ్చు. ఈ ఫిర్యాదులను ఆయా ప్రాంతాలవారీగా ప్రతినెలా పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపడతారు.



తప్పెటగుండ్లు వాయిస్తున్న కళాకారులు - కాళికా అవతారాలలో కళాకారులు - కలశ ఊరేగింపులో కేరళ డ్రమ్స్

కాణిపాకంలో కలశ ఊరేగింపు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో జరుగుతున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా కల్పవృక్ష వాహన సేవను పురస్కరించుకుని కలశ ఊరేగింపును గురువారం ఉదయం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో పెంచలకిషోర్ ఆధ్వర్యంలో అర్చక, వేదపండితులు, సిబ్బంది, భక్తులు పాల కలశాలను తలపై పెట్టుకుని కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. పాల కలశాలను ఆలయంలోకి తీసుకొచ్చి కల్యాణ వేదిక వద్ద సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవర్లకు క్షీరాభిషేకం చేశారు. కలశ ఊరేగింపులో కోలాటాలు, కేరళ వాయిద్యాలు, తప్పెడగుండ్లు అలరించాయి. ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ప్రసాద్, ధనంజయ, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు, అర్చక, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.వంద కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం

● కలెక్టర్ సుమిత్‌కుమార్



కోకావాండ్లపూరులో గ్రామస్తులతో కలిసి నడుస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రూ.వంద కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం చిత్తూరు నగరంలోని 49, 50 డివిజన్లలోని కోకావాండ్లపూరులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.70-80కోట్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో రోడ్లు నిర్మిస్తామన్నారు. పలమనేరు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో జడ్పీ నిధులు రూ.1.50 కోట్లతో రోడ్ల నిర్మాణాన్ని చేపట్టామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. చిత్తూరు నగరంలోని 7,8 డివిజన్లలో రూ.3కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

రెండు కిలోమీటర్లు నడిచి.. సమస్యలు తెలుసుకుని..

అపోలో ఆస్పత్రి వెనుకభాగం నుంచి కోకావాండ్లవూరు వరకు స్థానికులతో కలిసి రెండు కిలోమీటర్లు కలెక్టర్ నడిచి వెళ్లారు. దారి పొడవునా స్థానికులు చెప్పిన సమస్యలను ఓపిగ్గా ఉన్నారు. కోకావాండ్లవూరు అభివృద్ధికి సమగ్ర నివేదికను తయారు చేయాలని కమిషనర్, తహసీల్దార్‌ను ఆదేశించారు. డిసెంబరు నాటికి మౌలిక వసతులు కల్పిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నరసింహ ప్రసాద్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఎంహెచ్‌వో లోకేష్, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ కులశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్ పనితీరు ప్రశంసనీయం : అమర్



పలమనేరు, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి) : నేపాల్‌లో జరుగుతున్న మారణ హోమంలో తెలుగు ప్రజలు చిక్కుకున్నారని తెలియగానే క్షణం కూడా ఆలస్యంచేయకుండా మంత్రి నారా లోకేష్ స్పందించారంటూ పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి గురువారం ఒక ప్రకటనలో ప్రశంసించారు.ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి ఎప్పుడు ఎక్కడ ఆపద వచ్చినా తెలుగుదేశం పార్టీ ముందుంటుందన్న విషయం నేపాల్ ఘటనతో మరోసారి స్పష్టమైందని తెలిపారు.నేపాల్‌లో అల్లర్లు జరుగుతున్నాయన్న విషయం తెలియగానే లోకేష్ తన అనంతపురం పర్యటనను రద్దుచేసుకొని ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూం ద్వారా సహాయక చర్యలను వేగవంతం చేశారన్నారు.బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పడమే కాక ఎక్కడెక్కడ ఉన్నారో లొకేషన్ కోఆర్డినేటర్లతో సహా మ్యాప్ సిద్ధం చేయించారన్నారు.ఆహారం ,నీరు, వసతి సదుపాయాలు కల్పించేలా చూశారన్నారు. ప్రజలపట్ల బాధ్యతను లోకేష్ చాటి చెప్పారన్నారు. కేంద్రంతో సమన్వయం చేసుకొని పక్కా వ్యూహంతో ఆపదలో ఉన్న 215మందిని సురక్షితంగా స్వస్థలాలకు తరలించడంలో లోకేష్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. గత జూన్ నెలలో కాంబోడియాలో మోసపూరిత ఉద్యోగ ఆఫర్లతో చిక్కుకొన్న మీసాల ఆదిబాబు వంటి తెలుగు యువకులను లోకేష్ బాబు రక్షించారని గుర్తుచేశారు.నేపాల్ ఘటనపై జగన్ స్పందించక పోవడం చూస్తుంటే మానవత దృక్పథంతో కూడా ఆయన వ్యవహరించలేదనిపిస్తుందన్నారు.

14 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని గోడౌన్‌కు చేర్చిన పోలీసులు

బంగారుపాళ్యం,సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ వ్యవస్థకు చెందిన 14 టన్నుల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ కత్తిశ్రీనివాసులు గురువారం తెలిపారు. మొగిలి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా చిత్తూరు నుంచి కర్ణాటకకు పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న లగేజీ వ్యాన్,మినీ లారీలను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.లక్షా 42 వేల రూపాయల విలువైన 14,257 కేజీల బియ్యం స్వాధీనం చేసుకుని డ్రైవర్లు భానుమూర్తి, రోషన్‌లను విచారిస్తున్నామని చెప్పారు.

మామిడి రైతులకు త్వరలోనే రూ.160 కోట్ల సబ్సిడీ జమ

● కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుల బ్యాంకు ఖాతాలకు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఈనెల 20-25 తేదీల మధ్య రూ.160 కోట్ల సబ్సిడీ మొత్తాన్ని జమ చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుత మామిడి సీజన్‌లో 37 వేల మంది రైతుల నుంచి వివిధ మార్గాల ద్వారా 4.10 మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి కాయల కొనుగోళ్లు జరిగాయన్నారు.గుజ్జు పరిశ్రమల తరపున 2.35 టన్నులు, ర్యాంపుల తరపున 1.65 టన్నుల కాయలు కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఉద్యానశాఖ ద్వారా గత ఏడాది నుంచి రూ.20 కోట్లు పంటల అభివృద్ధికి ఖర్చు చేయగా, అందులో రూ.10 కోట్లు మామిడి పంట ఉత్పత్తికే ఖర్చుచేశామన్నారు. కవర్లు, కొత్త మొక్కలు, మౌలిక సదుపాయాలు, శిక్షణ తదితర కార్యక్రమాలకు ఈ మొత్తాన్ని ఖర్చుచేశామని చెప్పారు. మామిడి పంట ఉత్పత్తిలో భాగంగా 10,500 హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ కోసం రూ.100 కోట్ల విలువైన ఉపకరణాలు అందించామని వివరించారు. ఇటీవల కొందరు రైతులు రాజకీయ పార్టీల ముసుగులో తామేదో చేస్తామని మామిడి రైతులను మభ్యపెడుతున్నారని, వాటిని నమ్మకండని చెప్పారు. మ్యాంగో వెల్ఫేర్ అసోసియేషన్‌గా కొందరు ప్రకటించుకున్నారని, అది గుర్తింపు లేని సంఘం అని వివరించారు. జిల్లాలో రెండు ఫ్యాక్టరీలు మామిడి రైతులకు పాక్షికంగానే చెల్లింపులు చేసినట్లు గుర్తించామని, ఆ ఫ్యాక్టరీల యాజమాన్యాలపై త్వరలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. తోతాపురి మామిడి రకం ఉత్పత్తి చిత్తూరులో బాగుందంటూ గుజ్జు ఫ్యాక్టరీని చిత్తూరులో కూడా ఏర్పాటు చేసేందుకు ఓ కంపెనీ ముందుకొచ్చిందని తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

ఎమ్మెల్యేలు నాని, మురళీమోహన్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానితో మురళీమోహన్, కిరణ్ రాయల్

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ హామీలను నెరవేరుస్తూ అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న కూటమి ప్రభుత్వ పనితీరు చూసి ఓర్వలేక వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అర్థరహితమైన విమర్శలు చేస్తున్నారని చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, కలికిరి మురళీమోహన్ ధ్వజమెత్తారు. ప్రెస్‌క్లబ్ గురువారం వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో పూర్తిచేసి అందుబాటులోకి తేవాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం పట్ల అక్కసు వెళ్లగక్కడాన్ని తప్పుబట్టారు. మెడికల్ కాలేజీల టెండర్లలో పాల్గొనొద్దని, తామొస్తే వాటిని రద్దు చేస్తామని బెదిరింపులకు పాల్పడటం చూస్తుంటే జగన్ రాష్ట్రాభివృద్ధిని ఓర్చుకోలేకపోతున్నారనే విషయం స్పష్టంగా అర్థమవుతోందన్నారు. సూపర్ సిక్స్ సభ విజయవంతం కాకుండా జగన్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు. దోపిడీలు, దౌర్జన్యాలు, స్కాములతో ఐదేళ్లపాటు పాలన సాగించిన జగన్ ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక తన సోషల్ మీడియా, సొంత పత్రిక ద్వారా తప్పుడు సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 'మళ్లీ మేమొస్తే అంతుచూస్తాం' అంటూ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంపై బురద జల్లడానికి జగన్ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈ విషయం త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో మరోసారి స్పష్టమవుతుందన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

బాలికా విద్యతో దేశ ప్రగతి



పాఠశాలలో కేక్ కట్ చేసి బాలికలకు తినిపిస్తున్న ఉపాధ్యాయులు

కుప్పం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రగతి బాలికా విద్య దోహదం చేస్తుందని కుప్పం మండలం అడవిబూదుగూరు మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోతుగుంట గురవయ్యనాయుడు అన్నారు. ఈ పాఠశాలలో గురువారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో బాలికల భాగస్వామ్యం కీలకంగా మారిందన్నారు. బాలికలకు అవసరమైన విద్యను అందించడంలో తల్లిదండ్రులు తగిన ప్రోత్సాహం అందించాలన్నారు. అలాగే బాలికలకు ప్రభుత్వ పరంగా అందిస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవడంలో ఉపాధ్యాయులు వారికి అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు విజయేంద్ర రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనకనాశమ్మ ఆలయ అభివృద్ధికి రూ.8 కోట్లు మంజూరు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం పెద్దవంక గ్రామంలో వెలసిన కనకనాశమ్మ ఆలయ అభివృద్ధికి రూ.8 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. ఈ సందర్భంగా వారు గురువారం కనకనాశమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ మొత్తం నిధుల్లో రూ.3.5 కోట్లను ఆలయం అభివృద్ధికి అవసరమైన పనులకు, మరో రూ.4.5 కోట్లను రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి కేటాయించినట్లు చెప్పారు. ఆలయాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

121 మందికి ఉచిత వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న డా.మధు

రామకుప్పం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం రామకుప్పం పట్టణం, రాజుపేట గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో సుమారు 121 మంది రోగులకు ట్రస్టు వైద్యాధికారి మధు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే పలువురు రోగులను మెరుగైన వైద్య సేవల కోసం పెద్దాసుపత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది బాలగణేష్, ఝాన్సీరాణీ, స్రవంతి పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శిద్దరామయ్య

కల్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 17వ తేదీన అండర్-14, అండర్-17 విభాగంలో బాల బాలికలకు నిర్వహించే క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల ఎమ్మార్సీలో గురువారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, పీడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బాల బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా తదితర పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన జట్టులను డివిజనల్ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేస్తారని.. పోటీల్లో విద్యార్థులు అధికంగా పాల్గొనాలని ఎంఈవోలు కోరారు. హెచ్ఎంలు, పీడీలు పాల్గొన్నారు.

బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ విభజన వద్దు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో రెడ్డెప్ప ఆచారి

రొంపిచెర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీని రెండుగా విభజించడం మానుకోవాలని గ్రామస్తులు కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో గురువారం బొమ్మయ్యగారిపల్లె సచివాలయం వద్ద గ్రామసభ జరిగింది. గత వైసీపీ ప్రభుత్వంలో బొమ్మయ్యగారిపల్లె పంచాయతీని చల్లావారిపల్లె, బొమ్మయ్యగారిపల్లెలను రెండు పంచాయతీల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. దీంతో మరోవర్గం అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయించారు. ఐదేళ్లగా పంచాయతీ ఎన్నికలు జరగలేదు. ఎంపీడీవోనే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ ఉన్నారు. దీంతో గ్రామసభ ఏర్పాటు చేయడంతో ఒకే పంచాయతీగా ఉండాలని గ్రామస్తులు చేతులెత్తి ఆమోదం తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఎంపీడీవో రెడ్డెప్ప ఆచారి తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మల్బరీ షెడ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో కుమార్

రామకుప్పం/శాంతిపురం 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శాంతిపురం ఎంపీడీవో కుమార్ కోరారు. గురువారం ఆయన మండలం పరిధి శివకురుబూరులో ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న మల్బరీ షెడ్, గోకులం షెడ్ల నిర్మాణాలు, మల్బరీ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణపు పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట టీఏ శంకర్, ఇతర సిబ్బంది ఉన్నారు.

టీడీపీలో కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు



చల్లా రామచంద్రారెడ్డిని కలిసిన అమర్నాథ్

రొంపిచెర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు సముచిత న్యాయం, గుర్తింపు ఉంటుందని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం సదుం మండలానికి చెందిన అమర్నాథ్ చల్లా రామచంద్రారెడ్డిని రొంపిచెర్లలోని గృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పూల మాలతో సత్కరించారు. కార్యక్రమంలో సదుం మండల పార్టీ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, నారాయణ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో వాణిశ్రీదేవి

రొంపిచెర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలపై అవగాహన కలిగి ఉండాలని పులిచెర్ల ప్రాజెక్టు సీడీపీవో వాణిశ్రీదేవి అన్నారు. గురువారం రొంపిచెర్ల కస్తూర్బా విద్యాలయంలో సంకల్ప కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలు, లింగవివక్షత, స్కిల్ డెవలప్‌మెంట్, పోక్సో చట్టం, నెలసరి శుభ్రత, గుడ్‌టచ్-బ్యాడ్ టచ్‌లపై తెలియజేశారు. సమావేశంలో ఎస్ఐ సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమలత, సూపర్‌వైజర్ డి.శిరీష, అంగన్వాడీ కార్యకర్తలు అలివేలు, హసీనా లావణ్య సంపత్‌కుమారి పాల్గొన్నారు.

మిట్టపల్లెలో చోరీ

రామకుప్పం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని మిట్టపల్లె గ్రామంలో పట్టపగలే దొంగలు తెగబడ్డారు. తాళం వేసిన ఇంటి తలుపులు పగుల గొట్టి బీరువాలోని బంగారు నగలు చోరీ చేశారు. మిట్టపల్లెలోని మునిరత్నమ్మ బుధవారం మధ్యాహ్నం బంధువుల ఇంట్లో జరిగిన ఓ వేడుకలో పాల్గొనేందుకు కుప్పం వెళ్లింది. సాయంత్రం పొరుగింటి వారు ఆమెకు ఫోన్ చేసి టీ తాగేందుకు రమ్మన్నారు. తాను ప్రస్తుతం కుప్పంలో ఉన్నానని ఆమె సమాధానమిచ్చింది. ఆమె కుప్పంలో ఉంటే ఇంటి తలుపులు తెరిచే ఉన్నాయని గుర్తించిన స్థానికులు దొంగలు పడినట్లు గుర్తించి సమాచారం అందించారు. ఇంటికి చేరుకున్న మునిరత్నమ్మ 31 గ్రాముల బంగారు చోరీకి గురైనట్లు గుర్తించి గురువారం రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వేలిముద్రల నమూనాలను సేకరించారు. ఎస్ఐ వెంకటమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుంగనూరులో శోభాయాత్ర



శోభాయాత్రలో స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతి స్వామీజీ

పుంగనూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో గురువారం హరిహరపురం మఠాధిపతి స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతి స్వామి శోభాయాత్ర ఘనంగా జరిగింది. కర్ణాటక నుంచి వచ్చిన స్వామికి పుంగనూరు బ్రాహ్మణ సంఘ నాయకులు, హిందువులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మొదట కట్టమీద వెలసిన వరసిద్ది వినాయకస్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి రథంపై స్థానిక నగరి, బ్రాహ్మణవీధిలో మంగళ వాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలతో శోభయాత్ర ఘనంగా సాగింది. మహిళలు, హిందువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సోమలలో ఉత్తమ టీచర్లకు సన్మానం



సన్మానం అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు

సోమల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను మండల అధికారులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో నారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను క్రమశిక్షణతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రధాన పాత్ర పోషిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు విజయకుమారి, శివరత్న, ఉపాధ్యాయులు జీసీకే. ప్రసాద్, ఎల్లయ్య, శివరాం, భాస్కర్, ఎస్వీ రమణ, హరీష్ , లక్ష్మీపతి, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ అమలు చేయాలి



పుంగనూరులో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛన్ అమలు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం పుంగనూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీచర్స్ ఫోరం కన్వీనర్ మోహన్‌యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57ను అమలు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దేశంలో 16 రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమోను అమలు చేసినట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో హైకోర్టు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘనాయకులు కడియాల మురళీ, అయూబ్‌ఖాన్, మంజునాథ్, బుడ్డన్న, శంకర్, లింగమూర్తి, శ్రీరాములురెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రహదారులు గుంతలమయం..!

● తరచూ ప్రమాదాల బారిన వాహనదారులు ● అవస్థలు పడుతున్న గ్రామీణ ప్రజలు



పుంగనూరు- వనమలదిన్నె మార్గంలో అధ్వానంగా ఉన్న రోడ్డు



పుంగనూరు - మాగాండ్లపల్లె రోడులో గుంతలు



సదుం మండలంలోని నాయన పాకాల రోడ్డుపై గుంత

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం వనమలదిన్నె మార్గంలోని పలు గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. ఈ మార్గంలో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పుంగనూరు నుంచి వనమలదిన్నె, మేలుందొడ్డి, మేకనజామనపల్లె, వనమలదిన్నె మార్గంలో కర్ణాటక రాష్ట్రానికి వాహనాలు ప్రయాణిస్తాయి. ఈ మార్గంలో దాదాపు 8 గ్రామాల ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం వర్షం కురిస్తే ఈ మార్గంలో ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించాలంటే ఎక్కడ గుంతలు ఉన్నాయో అని భయాందోళనలో వాహనాలు నడపాల్సి ఉందని వాపోతున్నారు. అలాగే పుంగనూరు- మాగాండ్లపల్లె మార్గంలోని రోడ్డు గుంతలు పడటంతో ఆ మార్గంలో ప్రయాణించే రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల కంకర తేలిపోవడంతో నరకయాతన పడుతున్నట్లు వాహన చోదకులు వాపోతున్నారు. పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పుంగనూరు మండల ప్రజలు కోరుతున్నారు.

సదుం మండలంలోనూ..

● **సదుం:** సదుం నుంచి నాయన పాకాల వరకు ఉన్న రోడ్డు గుంతలమయమై అధ్వానంగా మారింది. గత కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో సదుం నుంచి కిలోమీటరు మేర అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. ఆ తర్వాత ఇటీవల నిర్మించిన కల్వర్టులతో గుంతలమయమై ఇటు ద్విచక్ర వాహనాలు, అటు నాలుగు చక్రాల వాహనాల చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఎన్నికల ముందు ఇదే రోడ్డు మార్గంలో పదుల సంఖ్యలో కల్వర్టులు నిర్మించారు. దీంతో రోడ్డు ఎత్తుతగ్గులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కల్వర్టుల నిర్మాణం తరువాత సదుం నుంచి పెద్దఉప్పరపల్లె వరకు తారు డబుల్ రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు జరిగాయి. సార్వత్రిక ఎన్నికల కోడ్‌తో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఈ మార్గంలో ప్రభుత్వాస్పత్రి, జడ్పీ ఉన్నత పాఠశాల, బాలుర జూనియర్ కళాశాల, తహసీల్దారు, మండల పరిషత్ కార్యాలయాలు, వసతి గృహాలు ఉన్నాయి. జిల్లా ఉన్నతాధికారులు సైతం తరచూ ఇదే మార్గాల్లో వెళుతున్నా.. రోడ్డుకు కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు. చిన్నపాటి చినుకులకే గుంతలు పడుతున్నాయి. ఈ మార్గంలోనే ఆరు పంచాయతీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

బైరెడ్డిపల్లెలో..

● **బైరెడ్డిపల్లె:** బైరెడ్డిపల్లె నుంచి పుంగనూరు వెళ్లే రహదారిలో అక్కడక్కడా గుంతలు ఏర్పడి వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి మధ్యలో గుంతలు ఉండటంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉంది. నిత్యం ఈ రహదారిలో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. దగ్గరికి వస్తే తప్ప గుంతలు ఉన్న విషయం తెలియక ద్విచక్రవాహనాలు గుంతలో దిగి ప్రమాదపుటంచుల వరకు వెళుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బైరెడ్డిపల్లె - పుంగనూరు రహదారిలో ఉన్న గుంతలను పూడ్చి ప్రమాదాలు జరగకుండా నివారించాలని పలువురు కోరుతున్నారు.



గుంతలుగా సదుం మండలంలోని ఎర్రాతివారిపల్లెకు వెళ్లే రోడ్డు



అడుగడుగునా గుంతలతో అధ్వాన స్థితిలో నాయన పాకాల రోడ్డు



బైరెడ్డిపల్లె - పుంగనూరు రహదారిలో ఉన్న గుంత

సంజీవిని ప్రాజెక్ట్‌తో అందరికీ ఆరోగ్యం: కంచర్ల

● పేదలకు రూ.43.59 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



కుప్పంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్సీ ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పైలెట్‌గా కుప్పం నుంచి ప్రారంభించిన సంజీవిని ప్రాజెక్ట్ ద్వారా నియోకవర్గ ప్రజలందరికీ మెరుగైన ఆరోగ్య సేవలు అందుతాయని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం పేదలైన 59 మంది లబ్ధిదారులకు రూ.43,58,869 విలువ కలిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. కుప్పం మండలంలో 32 మందికి రూ.25,30,548, కుప్పం మున్సిపాలిటీలో 27 మందికి రూ.18,28,321 నగదును ముఖ్యమంత్రి సహాయనిధి కింద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ప్రజలకు అందిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఉన్నత స్థానానికి తీసుకెళ్లడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడిని దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గ ప్రజలకు సరైన, మెరుగైన వైద్య సేవలు అందించడానికి సంజీవిని పథకాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా కుప్పంలో ప్రారంభించారని చెప్పారు. నియోజకవర్గంలోని 13 ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాలలో ప్రజలందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. మారుమూల కుప్పంలో ప్రతిఒక్కరి ఆరోగ్య చరిత్ర సంజీవిని ప్రాజెక్ట్ ద్వారా డిజిటలైజ్ అవుతుందని చెప్పారు. టీడీపీ కుప్పం మున్సిపల్, మండల అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి కింద నియోజకవర్గంలోని పేదలకు అవసరమైన సాయాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, కడా రాజకీయ సలహా మండలి సభ్యులు సతీశ్, రామచంద్ర, రఘు, రాష్ట్ర కురబకుల కార్పొరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, కౌన్సిలర్లు సురేశ్, సోము, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జీలు కన్నన్, శ్రీనివాసులు, హైదర్ వలి, లీలా వెంకటేశ్, సర్పంచ్ ధనశేఖర్, సంతోశ్, మణి, మహేంద్ర, వసంతమ్మ, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



రణభేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కల్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సదాశివరెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ మహేంద్ర తెలిపారు. పులిచెర్ల మండలం మంగళంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15న ప్రారంభంకానున్న యూటీఎఫ్ రణభేరి బైక్ ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన 4 డీఏలు, పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని తెలిపారు. యూటీఎఫ్ నాయకులు నానిక నాయక్, జయప్రకాష్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.

స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



విజయవాడలో ధర్నా చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

పలమనేరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ గురువారం విజయవాడ ధర్నాచౌక్ లో జరిగిన ధర్నా కార్యక్రమంలో పలమనేరు నుంచి అరుణ్‌కుమార్, భర్కత్, దామోదరం నాయక్, రాజా, వేలునాయక్, రవినాయక్ పాల్గొన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులకు తక్షణమే సిలబస్ ప్రకటించి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 86 వేల మంది ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లలకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. అనంతరం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర నాయకులు బసవ, కృష్ణ, మహేష్, అభ్యర్థులు బాబు, మధు, లోకేష్, దివ్య, రమ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరి మృతి



మృతిచెందిన శ్రీనివాసులు

వి.కోట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం ఏడుచుట్లకోట సమీపంలో ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఏడుచుట్లకోటకు చెందిన శ్రీనివాసులు (56) గురువారం సాయంత్రం కూలి పని ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. వికోట-పేర్నాంబట్ రోడ్డులో వేలూరు నుంచి వస్తున్న ద్విచక్రవాహనం శ్రీనివాసులును ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులును స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సీఐ సోమశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలంలోని మల్లుపల్లె సమీప పొలాల్లో గురువారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండటం గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా బోయకొండ ప్రాంతం యానాదిపాళ్యంకు చెందిన ఎర్రప్ప(48)గా గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ బాలిక గురువారం ఉదయం నుంచి కనిపించలేదని బాలిక తల్లిదండ్రులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అశ్వర్థనారాయణ తెలిపారు.

కౌండిన్య రిజర్వాయర్‌లో గుర్తుతెలియని మృతదేహం



పలమనేరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని కాలువపల్లి వద్ద కౌండిన్య రిజర్వాయర్‌లో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించారు. గురువారం సాయంత్రం గ్రామస్తుల సమాచారం మేరకు పలమనేరు పోలీసులు చేరుకుని కౌండిన్య రిజర్వాయర్‌లోని మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడు సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగి ప్యాంటు, ఎర్రటి గీతలు కలిగిన ఫుల్‌షర్టు ధరించి ఎడమ చేతికి గడియారం కలిగి ఉన్నాడు. సుమారు మూడు రోజుల క్రితం చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. పోలీసులు మృతుడి శవాన్ని శవపరీక్ష కోసం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్ దొంగలు బాబోయ్..!


ఆలపాక కండ్రిగలో స్టార్టర్ కేబుల్ చోరీ చేసిన దొంగలు

విజయపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెల రోజుల్లో సుమారు 35 మందికి చెందిన స్టార్టర్ల, మోటారు కేబుళ్ల చోరీకి గురయ్యాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఆనుకుని ఉన్న, దారి వెంబడి ఉన్న వ్యవసాయ మోటారు కేబుళ్లు తరచూ చోరీకి గురవుతున్నాయని వాపోతున్నారు. ఆలపాక కండ్రిగలో 20 రోజుల్లోనే మూడు పర్యాయాలు మోటారు కేబుల్ చోరీకి గురైందని సర్పంచ్ బాబు తెలిపారు. కళియంబాకం, సామిరెడ్డికండ్రిగ, పన్నూరు, బూచివానత్తం ప్రాంతాల్లో నిత్యం మద్యానికి బానిసైన మందుబాబులు ఈ చోరీలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీనిపై పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి


అధికారులతో మాట్లాడుతున్న డీపీవో సుధాకరరావు

వెదురుకుప్పం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీపీవో సుధాకరరావు అన్నారు. గురువారం కార్వేటినగరం మండలం కొల్లాగుంట పంచాయతీలోని సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్లు లీకేజీ లేకుండా చూడాలని చెప్పారు. ట్యాంకులను 15రోజులకు ఒకసారి క్లోరినేషన్‌తోపాటు కాలువలను శుభ్రం చేయాలన్నారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



పూతలపట్టు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టులో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం సాయంత్రం జరుపుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులైన ప్రమీల, చంద్ర, సుమతి, భారతి, పద్మమ్మ, మేరి రోసిలిన్, రేఖ, చంద్రన్, ఉష, ఉదయ్ కుమార్, వడివేలు, జగదీశ్వర నాయుడిని సత్కరించారు. టీడీపీ మండల మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, పూతలపట్టు సింగిల్ విండో అధ్యక్షుడు జగన్నాథం, హెచ్ఎం ఈశ్వర్ ప్రసాద్, యూటీఎఫ్ నాయకులు నాగరాజు, రెడ్డెప్ప నాయుడు, జార్జ్, మునిరత్నం, ఎంఈవోలు వాసుదేవన్, మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ మాసిలామణి, ఎంపీడీవో నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సీటమ్స్'లో క్యాంపస్ సెలక్షన్స్



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'సీటమ్స్'లో బెంగళూరుకు చెందిన ఐటీ సాఫ్ట్‌వేర్ శిక్షణ సంస్థ నిర్వహించిన క్యూస్పైడర్స్ క్యాంపస్ సెలక్షన్స్‌లో కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఈ మేరకు కళాశాల చైర్మన్ రంగనాథం, ఎండీ డీఏ కల్పజ తెలిపారు. ఫైనలియర్ బీటెక్, ఎంసీఏ కోర్సులకు చెందిన 80 విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. వీరిని 'సీటమ్స్' కార్యదర్శి బద్రినారాయణ, అధ్యాపకులు అభినందించారు.

తవణంపల్లెలో టీడీపీ కార్యాలయం ప్రారంభం


టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్ తదితరులు

తవణంపల్లె, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లెలో టీడీపీ నూతన కార్యాలయాన్ని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో టీడీపీని మరింత పటిష్ఠం చేయడానికి సమష్టిగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, ఐరాల అధ్యక్షుడు గంగారపు హరిబాబు, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ నాయుడు, నాయకులు గాలి దిలీప, మోహన్ నాయుడు, మధుకుమార్, అమరేంద్ర నాయుడు, రంజిత్ రెడ్డి, బాబునాయుడు, ధనంజయనాయుడు, జయప్రకాష్, కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

15న ట్రాక్టర్లతో రైతులు మ్యాంగోయార్డుకు తరలిరండి


మీడియాతో మాట్లాడుతున్న మామిడి సంక్షేమ సంఘం నేతలు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'చిత్తూరు మ్యాంగోయార్డుకు ఈనెల 15వ తేదీన మామిడి రైతులు ట్రాక్టర్లతో తరలిరండి. అక్కడినుంచి కలెక్టరేట్‌కు వెళ్లి మన గోడును విన్నవించుకుందాం' అని జిల్లా మామిడి రైతుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.కె.హరిబాబు చౌదరి పిలుపునిచ్చారు. గంగాధరనెల్లూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తోతాపురి మామిడి రైతుల కోసం ప్రభుత్వం ప్రకటించిన రూ.4, పల్ప్ ఫ్యాక్టరీలు రూ.8 లెక్కన ఇస్తామన్న మొత్తాన్ని సకాలంలో రైతులకు ఇప్పించలేదన్నారు. దీనికోసం రైతులంతా కలిసికట్టుగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆనందనాయుడు, కార్యదర్శి లవకుమార్‌రెడ్డి, మండల యూనియన్ నేతలు హరిబాబునాయుడు, జయరామిరెడ్డి, సందీప్, త్యాగరాజులురెడ్డి, వెంకటేశులు, ప్రభాకర్, పురుషోత్తం, గుణశేఖర్‌రెడ్డి, ఆనందరెడ్డి, వాసుదేవరెడ్డి, రమేష్‌బాబురెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ కర్తవ్యం: ఎమ్మెల్యే

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా రాష్ట్ర ప్రభుత్వ పనిచేస్తుందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే తెలుగువారు ఎప్పుడు, ఎక్కడ, ఏ ఆపదలో ఉన్నా ఆదుకోవడానికి టీడీపీ ముందుంటుందని పేర్కొన్నారు. నేపాల్‌లో చెలరేగిన తీవ్ర ఆందోళనల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న తెలుగు ప్రజలను సురక్షితంగా రాష్ట్రానికి రప్పించడానికి మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో రియల్ టైం గవర్నెన్స్ ద్వారా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బాధితులతో నేరుగా మాట్లాడి.. వారిలో ధైర్యం నింపి, సహాయక చర్యలను వేగవంతం చేశారని వివరించారు.

తమిళనాడుకు గ్రావెల్ తరలింపుపై ఫిర్యాదు

పాలసముద్రం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'వనదుర్గాపురం నుంచి తమిళనాడుకు నగరికి చెందిన వైసీపీ నేత కేజే కుమార్ కుమారుడు మురళి ఐదు రోజులుగా వివాదాల మధ్య గ్రావెల్‌ను తమిళనాడుకు తరలిస్తున్నారు' అంటూ రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు తెలిపారు. ఈమేరకు కలెక్టర్, ఎస్పీ, మైన్స్ అధికారులకు, జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు, సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లు గురువారం పేర్కొన్నారు. చెన్నై సమీపంలో నిర్మిస్తున్న నేషనల్ హైవే రోడ్డు పనులకు పాలసముద్రం మండలం నుంచి గ్రావెల్ తరలించడానికి ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నించారు. పైగా గ్రావెల్‌కు జీఎస్టీ కూడా చెల్లించకుండా దొంగ బిల్లులతో తరలిస్తున్నారని ఫిర్యాదులో సూచించారు. మండలంలో జరుగుతున్న క్వారీలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.




కాణిపాక ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఆలయ ఈవో పెంచలకిషోర్, సిబ్బంది, భక్తులు - ఉత్సవర్లకు క్షీరాభిషేకం - ధ్వజస్తంభానికి పుష్పాలంకరణ






ఆస్థాన మండపంలో కళాకారిణుల నృత్యాభినయం - శ్రీరామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకంలోని ఓ సన్నివేశం - సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవర్లను తీసుకొస్తున్న ఆలయ ఈవో, సిబ్బంది

కట్టారు.. మరిచారు..!

నిరుపయోగంగా ప్రజామరుగుదొడ్డి

ఇబ్బందిపడుతున్న జనం


ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిరుపయోగంగా ఉన్న ప్రజామరుగుదొడ్డి

బంగారుపాళ్యం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద 15వ ఆర్థిక సంఘ నిధులతో రూ.6.46 లక్షలతో మూడేళ్ల క్రితం ప్రజా మరుగుదొడ్డి నిర్మించారు. కాంట్రాక్టరుకు బిల్లులు కూడా చెల్లించేశారు. దీనికి జంబువారిపల్లె పంచాయతీ వారు వాటర్ కనెక్షన్ ఇస్తే వాడుకలోకి తీసుకురావచ్చు. కానీ ఎందుకనో ఈ విషయాన్ని అందరూ మరిచిపోయారు. పలుమార్లు ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్డి వసతి లేక మండల కేంద్రానికి వచ్చే జనం తీవ్రఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మహిళల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. జనాభాకు అనుగుణంగా మరిన్ని ప్రజా మరుగుదొడ్లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

సీఆర్‌కండ్రిగకు నూతన సచివాలయం అవసరం

పెనుమూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఆర్ కండ్రిగ సచివాలయం సిబ్బంది పంచాయతీ కార్యాలయంలోని ఇరుకు గదుల్లో పాలన సాగిస్తున్నారని మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గురువారం ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి సచివాలయ భవనం కోర్టు కేసుతో ఆగిపోవడంతో పునాదులను పరిశీలించారు. నూతన సచివాలయ భవనం కోసం జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.

గణేష్ ఇరుముడుల సమర్పణ


ఇరుముడులతో నిడదవోలుకు చెందిన భక్తులు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ప్రత్యేక ఉత్సవాలను పురస్కరించుకుని 60 మంది నిడదవోలు భక్తులు గురువారం గణేష్ ఇరుముడులు సమర్పించారు. వీరిని ఆలయ ఈవో పెంచలకిషోర్ ఆహ్వానించి, దర్శన ఏర్పాట్లు చేశారు. కాగా, వరసిద్ధుడిని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి సరయురాయ్ గురువారం వేర్వేరుగా దర్శించుకున్నారు.

భూ వివాదంతో మామిడి మొక్కల పీకివేత


పీకేసిన మామిడి మొక్కలను చూపుతున్న బాధితులు

యాదమరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలంలోని వేపనపల్లెలో భూవివాదం కారణంగా మామిడి మొక్కలను పెరికివేశారని అధికారులకు బాధితులు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణంపల్లె పంచాయతీ వేపనపల్లె ఏఏడబ్ల్యూకు చెందిన లోకయ్య, జయమ్మ దంపతులు తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన ఎకరం 30సెంట్ల భూమిని కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే పక్క పొలం యజమాని ఏకాంబరం రెడ్డి తమ భూమిని ఇతరుల నుంచి కొనుగోలు చేశానని, అది తనకే చెందుతుందని వాదిస్తూ గొడవలకు దిగాడు. ఈ వివాదంపై బాధితులు గతంలో తహసీల్దార్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు లోకయ్య దంపతుల పొలంలో నాటిన పదుల సంఖ్యలో ఆరునెలల వయసున్న మామిడి మొక్కలను పెరికివేశారు. ఈ ఘటనపై తహసీల్దార్ పార్థసారథికి, ఎస్‌ఐ ఈశ్వర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వేడుకున్నారు.

విద్యాసామగ్రి వితరణ



పెనుమూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాపూజీ యువ జన సంఘం ఆధ్వర్యంలో ఉగ్రాణంపల్లె హైస్కూల్లో బాలికలకు విద్యా సామగ్రిని గురువారం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దొరైకన్నన్, దామోదరం, సురేష్‌బాబు, ఎంఈవోలు భాస్కర్‌నాయుడు, రాజేంద్రన్, హెచ్ఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


ఎంపీ ప్రసాదరావుతో బాధితులు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని లక్ష్మీనగర్‌కాలనీలో ఉన్న తన కార్యాలయంలో బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను గురువారం ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పంపిణీ చేశారు. మిట్టూరుకు చెందిన కుసుమకు రూ.లక్ష, గుడిపాల మండలం రామభద్రాపురంకు చెందిన శరత్‌కు రూ.40వేల చెక్కులను అందించారు. ఎంపీ మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు.

తిరుపతి జిల్లా యాదవ మహాసభ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం యాదవ్


గురవయ్య యాదవ్‌ను సత్కరిస్తున్న సుబ్రహ్మణ్యం యాదవ్

విజయపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా యాదవ మహాసభ అధ్యక్షుడిగా విజయపురం మండలం జంబాడకు చెందిన సుబ్రహ్మణ్యం యాదవ్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గురవయ్య యాదవ్ మార్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.

'ఉపాధి' పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో ప్రసంగిస్తున్న తహసీల్దార్ సుధాకర్

తవణంపల్లె, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని మండలంలోని రైతులు, శ్రామికులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ.. మండలంలో 18,700 బియ్యం కార్డులుంటే ఇప్పటివరకు 13,000 స్మార్టు రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. భూములు రీసర్వే పూర్తయిన 11 గ్రామాల్లో రైతులకు సంబంధించి పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీకి సిద్ధం చేయడం జరిగిందని చెప్పారు. మూడు నెలలుగా మండలంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శాఖలవారీగా సమీక్షించారు. జడ్పీటీసీ భారతి, ఎంపీడీవో రెడ్డిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని టిప్పర్ బోల్తా



వెదురుకుప్పం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం పచ్చికాపల్లం రోడ్డు చిన్నకనుమ మలుపు వద్ద 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని గురువారం తెల్లవారుజామున ఓ టిప్పర్ ఢీకొని బోల్తా పడింది. దాదాపు రెండు గంటల సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రాంతంలో సూచికలు లేకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వైభవంగా అమృత లింగేశ్వర స్వామి ఆలయ మహా కుంభాభిషేకం



చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తేనెబండ రోడ్డులో ఉన్న అభిరామి సమేత అమృత లింగేశ్వర స్వామి ఆలయ మహా కుంభాభిషేకం గురువారం వైభవంగా జరిగింది. అనంతరం ఆలయ నిర్వాహకులు అభిరామి సమేత అమృత లింగేశ్వర స్వామికి కల్యాణోత్సవం నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


అమృత లింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు - కుంభాభిషేకంలో పాల్గొన్న భక్తులు

సంక్షిప్తంగా..

ఎమ్మెల్యే కార్యాలయంలో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరుసిటీ, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం వరకు నియోజకవర్గ ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అర్జీలతోపాటు ఆధార్ కార్డు జెరాక్స్‌ను జతచేయాలని సూచించారు.

వైద్యులకు సన్మానం



వెదురుకుప్పం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)కు ఇద్దరు వైద్యులు బదిలీపై వచ్చినట్లు ఇన్‌చార్జి డాక్టర్ లక్ష్మీపతి తెలిపారు. పుత్తూరు నుంచి సివిల్ సర్జన్ శ్రీకాంత్, గూడూరు ఏరియా ఆస్పత్రినుంచి డెంటల్ డాక్టర్ మోహన ఉన్నారన్నారు. వీరిని గురువారం సిబ్బందితో కలిసి సన్మానించారు. డాక్టర్ శృతిభాగ్యం, శృతి, కీర్తి పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

గుడిపాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పేయనపల్లె రైతు సేవా కేంద్రంలో రైతులకు వ్యవసాయశాఖ అధికారులు యూరియాను గురువారం పంపిణీ చేశారు. 150 మంది రైతులకు 150 బస్తాల యూరియాను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఉమ, ఏవో సంగీత, వీఆర్వో భవదీప్, గ్రామ వ్యవసాయ శాఖ సహాయకురాలు సాయిజ తదితరులు పాల్గొన్నారు.

14న నేత్ర, దంత వైద్య శిబిరం

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణవీధి శ్రీకరుణీకర్ సంఘ భవనంలో ఈనెల 14వ తేదీన నేత్ర, దంత వైద్య ఉచిత శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండులో ద్విచక్రవాహనం చోరీపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పాలసముద్రం మండలానికి చెందిన మోహన్ సొంత పనులపై గురువారం చిత్తూరుకు వచ్చాడు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద వాహనాన్ని ఆపి పనులు చూసుకుని వచ్చి చూస్తే కనపడలేదు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

24 మంది జూదరులపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా జూదమాడుతున్న 24 మందిపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. న్యూ బాలాజీ కాలనీ సందులోని ఓ కారు షెడ్డులో జూదమాడుతున్నారని సమాచారం రావడంతో దాడి చేశారు. 24 మందిని పట్టుకుని, వారి వద్ద నుంచి రూ. 37,160ను సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ఐరాల(కాణిపాకం) సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో శ్రీకృష్ణదేవరాయ నిత్యాన్నదాన ట్రస్ట్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్‌కు రాయల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(ఆర్ఈడబ్ల్యూఏ) గౌరవాధ్యక్షుడు పార్థసారథినాయుడు రూ.50 వేలను విరాళమిచ్చారు. దీనికి సంబంధించిన చెక్కును తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు అందజేశారు. రేవా కార్యవర్గ సభ్యులు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.